# దొంగ దొరక్కపోడు

చక్కటి కథలు రాస్తే రచయితగా గుర్తింపబడే కాలం వెళ్లి, సస్పెన్స్ సీరియల్స్ రాస్తేనే రచయితగా పర్తింపబడే ఈ కాలంలో, ఓ వారపత్రిక ఎడిటర్, తమ వారపత్రిక జన్మదిన సందర్భంగా నిర్వహించిన కథల పోటీకి వచ్చిన కథల్లో మంచి కథలు ఎన్నికచేసి, వాటిల్లో మొదటి మూడు బహుమతులు పొందే యోగ్యత గల కథలని ఎన్నిక చేయమనడం నా అదృష్టంగాభావించాను.

సాయంత్రం సబ్ ఎడిటర్ కథల కట్టలని ఆటోలో తీసుకొచ్చి నాకిచ్చి ఎప్పటికి కథలు ఎన్నికచేసి ఇవ్వాలో డెడ్ లైన్ చెప్పాడు.

"మాధవరావు గారి కథుందా?" యథాలాపంగా అడిగాను. తలూపాడు. ఆ వుద్యోగం అతనికి మాధవరావే ఇప్పించాడని నాకు తెలుసు.

"ఏదో చెప్పకూడదండి. ఎవరో రాసారో మీకు తెలియకూడదని నియమాల ప్రకారం రచయితల పేర్లు కనపడకుండా కొట్టేశాం" చెప్పారు సబ్ ఎడిటర్.

అతను వెళ్ళాక చిన్నగా నవ్వుకున్నాను.

* * *

ఆదివారం వస్తే చాలు పదేళ్ళ క్రితం ఎంతో సంబరంగా వుండేది.

కథలు రాస్తున్న కొత్తరోజులు. వారానికి రెండు మూడు కథలయినా రాసి తీసుకెళ్ళే వాణ్ణి. ప్రతీ ఆదివారం సాయంత్రం అయిదు నుంచి పది దాకా ఓ రెండు గంటలసేపు రఘురావ్ ఇంట్లో దాదాపు డజను మంది దాక రచయితలు చేరి ఆ వారంలో తాము రాసిన కథలు చదివి వినిపించే వారు. బావుంటే బావుందని మెచ్చుకునే వారు. ఎక్కడయినా లోపం వుంటే చెప్పే వారు.

అలాంటి సాహితీ సమావేశాలు నాలాంటి కొత్త రచయితలకి ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా వుండేవి. కథా రచయితగా ఎదగడానికి అలాంటి మీటింగ్స్ ఎంతో వుపయోగిస్తాయని నాకు అనుభవ పూర్వకంగా తెలుసు.

కథలు రాయడం విరమించిన కొందరు రచయితలు కూడా ఆ మీటింగ్‌కి వస్తూండేవారు. అడపాదడపా కథలు రాసే మాధవరావు ఆ మీటింగ్స్‌లోనే నాకు పరిచయం. నే రాసిన కథలని మెచ్చుకునే వారు. బావుళ్ళేదని ఏ కథని విమర్శించేవారు కాదు.

ఆయన వయస్సు నలభై ఆరు.

నా చిన్నప్పటినుంచి ఆయన కథలు చదువుతున్నాను. ఎక్కువ బావ, మరదళ్ళ ప్రేమ కథలు రాస్తూండే వాడు. బహుమతి కూడా సంపాదించారు ఓ కథకి.

నాకు రచయితలుగా ఆ మీటింగ్స్‌లో పరిచయం అయిన వాళ్ళలో ఇప్పటికీ బాగా గుర్తున్నవాడు మాధవరావే. అందుకు కారణం నా అభిమాన రచయిత అవటం కాదు.

నేను ద్వేషించే రచయిత అవటం.



ఓ ఆదివారం నేను ఓ వారపత్రిక కథల పోటీకి పంపడానికి రెండు కథలు రాసి తీసుకెళ్ళాను. ఆ రెండింటిలో ఏది పోటీకి పంపితే బావుంటుందో సలహా తీసుకుని మార్పులు, చేర్పులు ఏమైనా వుంటే వాటి ప్రకారం ఆ కథని తిరగ రాయడానికి నిర్ణయించుకున్నాను.

ఆ రెండు కథలని చదివాను. రెండూ బావున్నాయని అంతా మెచ్చుకున్నారు. అయితే ఏ కథని పోటీకి పంపాలా అన్న ఆలోచన అందరికీ వచ్చింది. రెండూ పంపించడం నాకిష్టం లేదు కాబట్టి ఏదో ఒకటే పంపదలచుకున్నానని చెప్పాను. రెండు పంపితే ఆ రెంటిలో ఏదీ బహుమతి గెలుచుకోవచ్చుననే నమ్మకం నాకు లేదని సంపాదకులు అనుకుంటారని నా భయం.

ఆ వారపత్రిక ఏ తరహా కథలకి ప్రథమ బహుమతి ఇస్తుందో రఘురావ్ చెప్పాడు. గతంలో మొదటి బహుమతి పొందిన నాలుగైదు కథలు క్లుప్తంగా చెప్పి అలాంటి సెంటిమెంట్ గల కథలకే బహుమతి లభిస్తుందని, కాబట్టి నేను రాసిన 'గండుపిల్లి' కథని పంపమని సలహా ఇచ్చారు.

రఘురావ్ సిఫార్సుని తోటి రచయితలంతా ఆమోదించారు. నేను రాసిన మరో కథ 'కిటికీ' ని ఆపి, దీపావళి ప్రత్యేక సంచికలలో దేనికయినా ప్రచురణకి పంపమని, అదీ బావుందని సలహా ఇచ్చాడుమాధవరావు.

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆ ప్రకారం 'గండుపిల్లి' ని ఆ వారపత్రిక నిర్వహించే కథల పోటీకి పంపాను. అది మామూలు ప్రచురణకి మాత్రమే స్వీకరించబడింది.

కాని ఓ ఘోరం జరిగింది. దీపావళి ప్రత్యేక సంచికల కోసం రెండో కథ 'కిటికీ'ని ఆపమన్న మాధవరావు నన్ను నిలువునా మోసం చేశాడు. ఆ కథని 'ఎదురింటి కిటికీ' పేరుతో తనే ఓ పత్రికలో రాసేసాడు. అది చదివిన నా రూం మేట్ "ఇదేంటి గురూ, ఇది నీ కథలా వుంది. మీ ఇద్దరూ ఒకే ఇంగ్లీషు కథని చదివి రాసారా?" అన్నాడు.

మాధవరావు మీద నాకు పీకలదాకా కోపం వచ్చింది. మళ్ళీ ఆదివారం మీటింగ్‌లో ఆయన నాకు చేసిన దొంగతనం గురించి రఘురామ్‌కి, తోటి రచయితలకు చెప్పాను. కాని అప్పటికే రైల్వేలో పనిచేసే మాధవరావు సికింద్రాబాద్ నుంచి హుబ్లీ బదిలీ అయి వెళ్ళిపోవడంతో ఏం చేయలేకపోయాం. మాధవరావు నన్ను ఆ విషయంలో అన్యాయం చేశాడన్న కసి నా మనస్సులోంచి పోలేదు.

** ** **

గుంటకల్‌లోని మాధవరావు క్వార్టర్ చిరునామా సంపాదించి ఆయనకు వుత్తరం రాసాను, మినీ కథల సంపుటి వొకదాన్ని వెలువరించాలను కొంటున్నానని, వీలయితే ఓ కథ పంపమని, పంపలేక పోతే ఆ సంగతి తెలియజేయమని స్వంత చిరునామా గల కవరు జత చేశాను.

పోటీ కోసం వచ్చిన కథలన్నీ చదివి బావుళ్ళేనివి, బావున్నవి, చాలా బావున్నవి, అతిగా బావున్నవి ఇలా నాలుగు రకాలుగా విభజించి వాటిమీద ఆ ప్రకారం ఏ, బి, సి, డి అక్షరాలు రాసాను.

వారపత్రిక సబ్ ఎడిటర్ రెండు రోజులకొకసారి ఫోన్ చేసి కథలను గురించి గుర్తుచేస్తున్నాడు. మాధవరావుకి టెలిగ్రాం పంపాను సమాధానం రాయమని.

మూడో రోజు సమాధానం వచ్చింది, చిన్న మినీ కథతో పాటు. కవరు చింపి ఆ రెంటినీ చూడగానే ఎంతో సంతోషం వేసింది.

మాధవరావు తను రాసిన కథలు చదివి వినిపించే వాడు. కాబట్టి నాకతని చేతి వ్రాతతో పరిచయం లేదు. ఇప్పుడతని ఉత్తరంలో నాక్కావలసిన చేతి వ్రాత నమూనా దొరికింది.

ఎన్నికకి నాకొచ్చిన కథల్లోంచి మాధవరావు చేతి వ్రాతనిబట్టి ఆయన కథని బయటకి తీసి దాన్ని 'బాగాలేవు' కథల దొంతరలోకి తోసాను, నిజానికది బావున్నా.

ఆ వారపత్రిక సబ్ ఎడిటర్ కథలు తీసుకోవడానికి వచ్చినప్పుడు నా కథను కూడా ఇచ్చాను, నన్ను జడ్జిగా వుంచామని ఎనౌన్స్ చేసే సంచికలో దాన్ని వేయమని!

అది మాధవరావు ఉత్తరంతోపాటు నాకు పంపిన మినీ కథ. దాన్ని యథాతథంగా నా చేతి వ్రాతతో ఫేర్ చేశాను.